

చీనీ టన్ను రూ.21,600

అనంతపురం మార్కెట్‌యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.21,600 పలికాయి.



టమాట కిలో రూ.10

అనంతపురం కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్ట ధర రూ.10 పలికింది. కనిష్టం రూ.7, సరాసరి రూ.9 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
38.2°/ 13.9°

జిల్లా అంతటా మంగళవారం చలి వాతావరణం కొనసాగింది. పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఈశాన్యం దిశగా గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

రాయితీతో మామిడి ఫ్రూట్ కవర్లు

• హెక్టారుకు రూ.10 వేలు ప్రోత్సాహం



అనంతపురం అగ్రికల్చర్: మామిడిలో నాణ్యమైన దిగుబడుల కోసం రైతులకు ప్రోత్సాహక రాయితీలు అందించనున్నట్లు ఉద్యానశాఖ డీడీ బీఎంవీ నరసింహారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాయలు మంచి పండ్లుగా తయారవడానికి వీలుగా రాయితీతో రక్షణ కవచం (ఫ్రూట్ కవర్) రాయితీతో ఇస్తామన్నారు. ఒక్కో కవర్ రూ.2 కాగా 50 శాతం రాయితీతో గరిష్టంగా ఒక హెక్టారుకు రూ.10 వేల వరకు రాయితీ వర్తింపజేస్తామన్నారు. కాయలు కోడిగుడ్డు సైజులో ఉన్నపుడు కవర్లు చుట్టాలన్నారు. గాలి చొరబడకుండా తొడిమ వరకు కట్టాలన్నారు. దీంతో ఊజీ ఈగ, తేనెమంచు పురుగు, మచ్చలు, తామర పురుగుల నుంచి రక్షణ ఉంటుందన్నారు. అధిక సూర్యరశ్మి, వడగండ్ల వాన నుంచి కూడా కాపాడుకోవచ్చన్నారు. తొడిమ కూడా దృఢంగా తయారై మంచి సైజు వస్తుందన్నారు. వీటికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండటం వల్ల రైతులకు గిట్టుబాటు అవుతుందన్నారు. ఉద్యానశాఖ అధికారులు లేదా రైతు భరోసా కేంద్రాల అసిస్టెంట్లను సంప్రదించాలన్నారు.

సుదర్శనరావుకే వీసీ బాధ్యతలు



అనంతపురం: ఇన్‌చార్జ్ వీసీగా ఉన్న ప్రొఫెసర్ హెచ్. సుదర్శనరావుకే ప్రభుత్వం పూర్తి స్థాయి బాధ్యతలు కట్టబెట్టింది. జేఎన్‌టీయూ (ఏ) నూతన వీసీగా ఆయనను నియమిస్తూ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. ప్రొఫెసర్ సుదర్శనరావు జేఎన్‌టీయూ(ఏ) ఇంజినీరింగ్ కళాశాలలోనే బీటెక్ పూర్తి చేశారు. ఇక్కడే చదివి అత్యున్నత స్థాయిలో బాధ్యతలు నిర్వర్తించే అవకాశం దక్కించుకోవడం గమనార్హం. జేఎన్‌టీయూ(ఏ)లో గతంలో మూడున్నర సంవత్సరాలు ఆయన రెక్టార్‌గా పనిచేశారు. బుధవారం ఆయన పదవీ బాధ్యతలు తీసుకోనున్నారు.

రైతులు ఇబ్బందులు పడకుండా చర్యలు



భూముల రీసర్వేపై ఆరా తీస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

పుట్లూరు: రైతులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. మండలంలో రీ సర్వే జరిగిన గ్రామాల్లో మంగళవారం కలెక్టర్ వినోద్ కుమార్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూరేపల్లి రెవెన్యూ గ్రామ 167 ఎల్‌పీఎం నంబర్‌లో 6.04 ఎకరాలు జాయింట్‌గా నమోదు కావడంతో రైతులు సబ్‌డివిజన్ చేయాలని ఇటీవల వినతి పత్రం అందించారన్నారు. తహసీల్దార్ శేషారెడ్డి, సర్వేయర్లు రైతులకు నోటీసులు అందించి హద్దులను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం మండలంలోని అరకటివేముల గ్రామ సచివాలయం నుంచి జెడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి, డీపీఓ నాగరాజు నాయుడు, డీఎల్‌డీఓలు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సచివాలయ ఉద్యోగులు రోజూ బయోమెట్రిక్ అటెండెన్స్ వేయాలన్నారు. హౌస్‌హోల్డ్ మిస్సింగ్ సిటిజన్ ప్రక్రియను పెండింగ్ లేకుండా పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీఓ కేశవనాయుడు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

24న 'పీఎం కిసాన్'!

అనంతపురం అగ్రికల్చర్: పీఎం కిసాన్ కింద ఈనెల 24న రైతుల ఖాతాల్లోకి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రూ.2 వేల చొప్పున జమ చేసే అవకాశం ఉందని వ్యవసాయశాఖ వర్గాలు తెలిపాయి. జూన్, అక్టోబర్, జనవరిలో విడతకు రూ.2 వేల చొప్పున మూడు విడతల్లో ఏటా రూ.6 వేల ప్రకారం విడుదల చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ సారి కాస్త ఆలస్యంగా ఫిబ్రవరిలో మూడో విడతగా 2.90 లక్షల మంది రైతుల ఖాతాల్లోకి రూ.58 కోట్లు విడుదల కావొచ్చని చెబుతున్నారు. మొదటి రెండు విడతలతో పోలిస్తే మూడో విడతలో మరికొందరు రైతులు 'పీఎం కిసాన్'కు అర్హత సాధించినట్లు అధికారులు తెలిపారు.

కార్పొరేటు బలిపీఠం

• ఆగని విద్యార్థుల ఆత్మహత్యలు
• జిల్లాలో ఇటీవల నలుగురు బలవన్మరణం
• తల్లిదండ్రులకు తీరని శోకం
• యాజమాన్యాల నిర్లక్ష్యమే కారణమంటున్న విద్యార్థి సంఘాలు
• మొద్దునిద్ర వీడని ప్రభుత్వం



సోమవారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఎస్‌ఆర్ కళాశాల విద్యార్థి మృతదేహాన్ని తీసుకెళ్తున్న దృశ్యం



అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లాలోని కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఇటీవల వరుసగా జరుగుతున్న విద్యార్థుల ఆత్మహత్యలు తల్లిదండ్రులను కలవరపెడుతున్నాయి. తాజాగా అనంతపురం ఆలమూరు రోడ్డులోని ఎస్ఆర్ జూనియర్ కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థి శ్రీకాంత్ కళాశాల సమీపంలోనే సోమవారం రాత్రి చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెందడం కలకలం రేపింది. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఇటీవల జిల్లాలో కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థల్లో చోటు చేసుకుంటున్న వరుస ఘటనలు రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి.

ప్రభుత్వం మొద్దనిద్ర..

ప్రస్తుతం పిల్లలపై సోషల్ మీడియా తీవ్ర ప్రభావం చూపుతోంది. దీనికితోడు యాజమాన్యాలు ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు పిల్లలను పుస్తకాలకే పరిమితం చేస్తుండటం.. ఆటా,పాటా లేకపోవడం.. బాగా చదువుకునే విద్యార్థులను ఒక గ్రూపుగా తయారు చేసి వారిని చదువుకునే యంత్రాలుగా మార్చుతుండటం వెరసి పిల్లలు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. ఈ క్రమంలోనే బలవన్మరణాలకు పాల్పడుతూ అయినవారికి తీరని శోకం మిగులుస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మొద్దునిద్ర వీడి ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల ఆగడాలపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

ఇటీవల జిల్లాలో జరిగిన ఘటనలు కొన్ని...

• అనంతపురం శివారులోని సోములదొడ్డి వద్ద ఉన్న నారాయణ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి చరణ్ మూడు అంతస్తుల భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు.
• గార్లదిన్నె సమీపంలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి పాఠశాల ఆవరణలోనే గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.
• అనంతపురం బళ్లారి రోడ్డులోని ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాలలో సీనియర్ ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది.
• ఇటీవల సోములదొడ్డి సమీపంలో శ్రీచైతన్య రెసిడెన్షియల్ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థి హాస్టల్ నుంచి వెళ్లిపోయాడు. వారం తర్వాత తిరుమలలో ఆచూకీ లభించడంతో తల్లిదండ్రులతో పాటు పాఠశాల యాజమాన్యం ఊపిరి పీల్చుకుంది.
• రెండేళ్ల క్రితం భవ్యశ్రీ అనే ఇంటర్ విద్యార్థిని అనంతపురం నగరంలోని నారాయణ క్యాంపస్ బిల్డింగ్ పై నుంచి దూకింది. సుదీర్ఘకాలం చికిత్స పొంది అదృష్టవశాత్తూ మృత్యువు నుంచి బయటపడింది.

ఫీజులపైనే శ్రద్ధ



కార్పొరేట్ విద్యా సంస్థల యాజమాన్యాలకు ఫీజులపై ఉన్న శ్రద్ధ విద్యార్థుల ప్రాణాలపై ఉండడం లేదు. ప్రభుత్వ నిబంధనలు ఎక్కడా పాటించడం లేదు. జిల్లాలో విద్యార్థుల వరుస ఆత్మహత్యలు, అఘాయిత్యాలు చోటు చేసుకుంటున్నా ప్రభుత్వం ఏమాత్రమూ పట్టించుకోవడం లేదు.

– కుళ్లాయిస్వామి, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి

ప్రభుత్వమే బాధ్యత వహించాలి



విద్యా సంస్థల్లో చోటు చేసుకుంటున్న ఘటనలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలి. బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించి తమను బాగా చూసుకుంటారనే తల్లిదండ్రుల ఆశలను కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యాలు చేస్తున్న ఒత్తిళ్లు ఆడియాసలు చేస్తున్నాయి.

– చంద్రశేఖర్‌యాదవ్, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు

ఆకుల్లా రాలిపోతున్నారు



చెట్టులో ఎండిన ఆకులు ఎలా రాలిపోతాయో.. అలా విద్యార్థుల ఆత్మహత్యలు జరుగుతున్నాయి. ఇటీవలి కాలంలోనే నలుగురు ఆత్మహత్య చేసుకున్నారు. అధికారులు సమగ్ర విచారణ జరపడం లేదు. ఈ కారణంగా వరుస ఘటనలు చోటు చేసుకుంటున్నాయి.

– పరమేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

కనీస భద్రత లేదు



కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థల్లో విద్యార్థులకు కనీస భద్రత లేదు. 5–6 మంది ఉండాల్సిన గదిలో 12–15 మందిని కుక్కుతున్నారు. ఉదయం లేచినప్పటి నుంచి రాత్రి పడుకునే దాకా చదువు చదువు అంటూ తీవ్ర ఒత్తిళ్లు చేయడం, ఫీజుల కోసం తల్లిదండ్రులను ఇబ్బందులు పెడుతుండడంతో బలవన్మరణాలకు పాల్పడుతున్నారు.

– సురేష్, బీసీ,ఎస్సీ,ఎస్టీ,మైనార్టీ సమైక్య రాష్ట్ర కార్యదర్శి

ఉద్యోగులతో బంతాట

• ఎప్పుడు పడితే అప్పుడు బదిలీలు
• ఆరుమాసాల్లో ఐదుగురు ఎస్పీలను మార్చిన వైనం
• అనంతపురం కార్పొరేషన్‌లో ఇష్టారాజ్యంగా కమిషనర్ల మార్పు
• తాజాగా విద్యుత్ శాఖ ఎస్ఈ బదిలీ
• అటకెక్కిన పాలన



సాక్షి ప్రతినిధి, అనంతపురం: కూటమి సర్కారు పుణ్యమా అని జిల్లా అధికార యంత్రాంగంలో తీవ్ర అనిశ్చితి నెలకొంది. ఉన్నతాధికారులు సైతం ఉద్యోగం చేయాలంటే భయపడుతున్నారు. ఎప్పటివరకూ ఉంటామో.. ఎప్పుడు బదిలీ చేస్తారో తెలియక ఆందోళన చెందుతున్నారు. శాఖల హెచ్‌ఓడీలకే దిక్కులేకుండా పోయిన పరిస్థితి. రాజకీయ జోక్యంతో రాత్రికి రాత్రే బదిలీలు జరుగుతుండటంతో పనిచేయాలంటేనే మనసొప్పడం లేదని అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలకు ముందు ఉద్యోగులకు అండగా ఉంటామని చెప్పి ఓట్లు వేయించుకున్న నాయకులు ఇప్పుడు తమ పనులు చేయకుంటే మెడపై కత్తి పెట్టి మరీ బదిలీ చేయిస్తున్న దుస్థితి నెలకొంది. ఇంత జరుగుతున్నా కలెక్టర్ పూర్తిగా నిశ్చేష్టులై చూస్తుండటంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఎస్ఈ బదిలీతో అలజడి..

కూటమి సర్కారు వచ్చేనాటికి ఉమ్మడి అనంతపురం జిల్లాకు విద్యుత్ శాఖ ఎస్ఈగా సురేంద్ర ఉండేవారు. ఈయనపై రాజకీయ ముద్రవేసి అనంతపురం జిల్లా ఎస్ఈగా తెచ్చారు. మడకశిర ఎమ్మెల్యే రాజు, అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తదితరులు సంతకాలు చేసి మరీ ఆయన్ను తీసుకొచ్చారు. అయితే, మాదిగ సామాజిక వర్గానికి చెందిన సంపత్‌కుమార్ నాలుగు నెలలు పని చేశారో లేదో ఉన్నఫళంగా రెండు రోజుల క్రితం బదిలీ అయ్యారు. దీంతో ఒక్కసారిగా విద్యుత్‌శాఖలో అలజడి మొదలైంది.

ఐదుగురు ఎస్పీలు..

కూటమి సర్కారు వచ్చాక జిల్లాకు ఐదుగురు ఎస్పీలు వచ్చి వెళ్లారు. ఎస్పీలపై ఇక్కడి నాయకులు పదే పదే అధిష్టానానికి ఫిర్యాదులు చేయడం మొదలు పెట్టారు. ఎన్నికల సమయంలో ఉన్న అన్బురాజన్ కొత్త ప్రభుత్వం ఏర్పడిన కొన్నాళ్లకే బదిలీ అయ్యారు. ఆ తర్వాత అమిత్ బర్దార్, గౌతమి శాలి, మురళీ కృష్ణలు వచ్చిన రెండు మాసాలకే తిరిగి వెళ్లిపోయారు. ప్రస్తుత ఎస్పీ జగదీష్‌పై కూడా బదిలీ కత్తి వేలాడుతోందని అంటున్నారు.

సంతకం చేయకుంటే ఊడినట్లే..

కూటమి ప్రభుత్వంలో అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ మరీ భ్రష్టు పట్టింది. ఇక్కడ ఐదు నెలల్లో ఐదుగురు కమిషనర్లు మారారు. నేతలు చెప్పిన చోట సంతకం చేయకపోతే మరుసటి రోజే బదిలీ కావాల్సి వస్తోంది. మేఘ స్వరూప్ అనంతరం నాగరాజు, రామలింగేశ్వర్, మల్లికార్జునరెడ్డిలు బదిలీ అయ్యారు. తాజాగా బాలస్వామి వచ్చారు. ఈయన ఎన్నాళ్లుంటారో తెలియని పరిస్థితి. దీంతో కార్పొరేషన్‌లో పాలన స్తంభించి పోయింది.

రెండు నెలలు తిరక్కముందే ఏఎస్పీపై..

శ్రీ సత్యసాయి జిల్లాలో పెనుకొండ డీఎస్పీగా ఉన్న ఆర్ల శ్రీనివాసులుకు ఇటీవల అడిషనల్ ఎస్పీగా పదోన్నతి వచ్చింది.అదే జిల్లాకు ఏఎస్పీగా పోస్టింగ్ ఇచ్చారు. ప్రశాంతంగా పనిచేస్తున్న సమయంలో ఉన్నఫళంగా ఆయనకు బదిలీ ఆర్డర్స్ వచ్చాయి. ఆ జిల్లా ఎస్పీకి నచ్చలేదని అడిషనల్ ఎస్పీని బదిలీ చేయించారనే విమర్శలొస్తున్నాయి. దీంతో శ్రీ సత్యసాయి జిల్లాలో పనిచేయడానికి ఎవరూ ముందుకు రావడం లేదు.

రుణ మంజూరులో ఎందుకింత నిర్లక్ష్యం?

• బ్యాంకర్ల తీరుపై కలెక్టర్ వినోద్‌కుమార్ అసహనం



అనంతపురం సిటీ: తరచూ సమీక్షలు నిర్వహిస్తున్నా, పదేపదే చెబుతున్నా బ్యాంకర్ల పని తీరులో మార్పు రావడం లేదని కలెక్టర్ వినోద్‌కుమార్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అనంతపురంలోని జిల్లా పరిషత్ డీపీఆర్‌సీ భవన్‌లో మంగళవారం జిల్లా సంప్రదింపుల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ విద్యా రుణాలకు సంబంధించి యూకో బ్యాంక్ 109 మందికి రుణాలు ఇవ్వాలని నిర్ణయించగా, కేవలం ముగ్గురికి మంజూరు చేయడం చూస్తే బ్యాంకర్ల పని తీరు ఎలా ఉందో ఇట్టే అర్థమైపోతుందన్నారు. స్టాండప్ పథకం కింద ఈ ఆర్థిక సంవత్సరంలో డిసెంబర్ నాటికి కేవలం 39.34 శాతం రుణాలు ఇవ్వడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇలాగైతే షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని, అప్పటికీ మార్పు రాకపోతే ఆయా శాఖల ఉన్నతాధికారులకు లేఖలు రాస్తామని స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కింద రుణాలు మంజూరు చేయాలని సూచించారు. ఆయా పథకాల కింద లక్ష్య సాధనలో వెనుకబడిన బ్యాంకర్లతో తరచూ సమీక్షలు చేయాలని ఎల్‌డీఎం, జిల్లా అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పశుసంవర్ధక, మత్స్య శాఖలకు చెందిన రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డులు అందజేయాలని సూచించారు. బీసీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి పథకాలకు సంబంధించి బ్యాంక్ లింకేజీ కోసం ప్రభుత్వం లక్ష్యాలను కేటాయించిందని, గడువులోగా రుణాలు మంజూరు చేయాలని స్పష్టం చేశారు. జిల్లాలో 34 బ్యాంకులకు సంబంధించి 290 బ్రాంచీలు ఉండగా, 51 గ్రామాల్లో ఆర్‌ఓ ప్లాంట్ల కోసం బ్యాంకులకు ప్రత్యేకంగా లేఖలు రాసి, ఏర్పాటయ్యేలా చూడాలని ఎల్‌డీఎంను ఆదేశించారు. రైతులకు విరివిగా పంట రుణాలు అందించి, వారికి మేలు చేసేలా చొరవ చూపాలని అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ సూచించారు. సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థుల సౌకర్యార్థం మినీ బస్సు ఏర్పాటుకు ముందుకు రావాలని కోరారు.

గిట్టుబాటుపై ఒత్తిడి తీసుకురండి

జిల్లాలో మిరప, పత్తి, పప్పుశనగ, సీడ్ జొన్న రైతులకు గిట్టుబాటు ధర కల్పించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని రైతు సంఘం నాయకులు ఎంపీ అంబికా లక్ష్మీనారాయణను కోరారు. ఖరీఫ్, రబీ పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ప్రకటించి బాధిత రైతులతో పాటు కౌలు రైతులనూ ఆదుకోవాలని కోరుతూ ఎంపీకి వినతి పత్రం అందజేశారు.

సాయీశ్వరా.. మముబ్రోవరా



సాయీశ్వర లింగానికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న విదేశీయులు

ప్రశాంతి నిలయం: సాయీశ్వర నామంతో ప్రశాంతి నిలయం మార్మోగింది. సత్యసాయి.. ఈశ్వరుడి ప్రతిరూపమంటూ కీర్తించారు. సాయీశ్వరా...మముబ్రోవరా అంటూ వేడుకున్నారు. విశ్వశాంతిని కాంక్షిస్తూ ప్రశాంతి నిలయంలో చేపట్టిన అతిరుద్ర మహాయజ్ఞంలో భాగంగా నార్త్ బిల్డింగ్స్ మైదానంలో చేపట్టిన అష్టోత్తర శత సహస్ర సాయీశ్వర లింగార్చన ఘట్టం మంగళవారం ముగిసింది. చివరి రోజు లింగార్చనలో పాల్గొన్న భక్తులు ప్రత్యేకంగా రూపొందించిన సాయీశ్వర లింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్‌రాజు దంపతులు సాయీశ్వరునికి పూజలు నిర్వహించారు. ఇక అతిరుద్ర మహాయజ్ఞం 6వ రోజు మంగళవారమూ కొనసాగింది. వేదపండితులు వేదమంత్రోచ్చారణ మధ్య యజ్ఞ క్రతువు నిర్వహించారు. సాయంత్రం ప్రముఖ హిందూస్థానీ సంగీత విద్వాంసుడు సంబుద్ధా ఛటర్జీ బృందం సంగీత కచేరీ భక్తులను ఆకట్టుకుంది. జ్యోతిష్య శాస్త్ర ఉపన్యాసకులు డాక్టర్ ఎస్.మురళీ భక్తులనుద్దేశించి ప్రసంగించారు.





సంగీత కచేరీ నిర్వహిస్తున్న సంబుద్ధా ఛటర్జీ బృందం, అతిరుద్ర మహాయజ్ఞంలో పాల్గొన్న భక్తులు

బరువెక్కిన గుండెతో వలసబాట

• మొలకలపెంట వ్యథ
• గ్రామంలో ఇప్పటికే వందకు పైగా ఇళ్లకు తాళాలు
• చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం



మొలకలపెంట గ్రామం



గ్రామంలో తాళం వేసిన ఓ ఇల్లు

గుంతకల్లు రూరల్: మండలంలోని మొలకలపెంట గ్రామస్తులు ఒకరి తరువాత మరొకరు వలస బాట పడుతున్నారు. ఉపాధి పనులు కల్పించి ఆదుకోవాల్సిన ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తుండటంతో నిస్సహాయ స్థితిలో ఊరు వదిలి వెళ్లిపోతున్నారు. 604 కుటుంబాలు, 2 వేలకు పైగా జనాభా ఉన్న మొలకలపెంట గ్రామంలో ప్రజలు వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. వర్షాభావం, వరుస తుపాన్ల కారణంగా ఖరీఫ్, రబీ పంటలు తుడిచిపెట్టుకు పోయాయి. కనీసం పెట్టుబడి కూడా చేతికి అందకపోవడంతో రైతన్నలు పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయారు. తినడానికి తిండి గింజలు కూడా లేక పూట గడవని స్థితిలో పొట్ట చేతపట్టుకుని వలసబాట పడుతున్నారు.

ఉపాధి ఊసేలేదు..

421 జాబ్ కార్డులు, 796 మంది కూలీలు ఉన్న మొలకలపెంట గ్రామంలో ఇప్పటివరకూ ఉపాధి పనులు ప్రారంభించనే లేదు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరిన తరువాత ఫీల్డ్ అసిస్టెంట్లను బలవంతంగా తొలగించారు. స్థానిక అధికార పార్టీ నాయకుల ఒత్తిడితో మొలకలపెంట ఫీల్డ్ అసిస్టెంట్‌కు ఉద్వాసన పలికిన అధికారులు.. కొత్త వారిని నియమించలేదు. దీంతో గ్రామంలో ఇప్పటి వరకూ ఉపాధి పనులు ప్రారంభం కాలేదు. ఈ ఒక్కటే కాదు.. గుంతకల్లు మండలంలోని మరో 7 గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకం ఇప్పటివరకూ జరగలేదు. దీంతో పనులు దొరక్క గ్రామీణులు వలస పోవాల్సిన దుస్థితి నెలకొంది.


గుంటూరుకు వలస వెళ్లారు



మాకు నాలుగు ఎకరాల భూమి ఉంది. ఈ ఏడాది పంటలు పండక అప్పుల పాలయ్యాం. వ్యవసాయం కోసం చేసిన అప్పులు ఇప్పటికే రూ.5 లక్షల మేర అయ్యాయి. కుటుంబ పోషణ కష్టంగా మారింది. గ్రామంలో కనీసం ఉపాధి పనులు కూడా లేకపోవడంతో పూటగడవని స్థితిలో నా భార్య, ఇద్దరు కొడుకులు గుంటూరుకు వలస వెళ్లారు.

– రంగనాయకులు, మొలకలపెంట


గొర్రెల్ని చూసుకుంటూ ఉన్నా..



రెండెకరాల పొలంలో ఈ ఏడాది కందిపంట సాగు చేశా. రూ.30 వేలకు పైగా పెట్టుబడి పెడితే రూ.20 వేలు వచ్చింది. వ్యవసాయంలో అప్పులు తప్ప ఆదాయ కనిపించడం లేదు. అప్పులు తీర్చే మార్గం కనిపించక నా భార్య, కొడుకు, కోడలు ముగ్గురినీ గుంటూరుకు వలస పంపా. 10 గొర్రెలు ఉండటంతో వాటిని చూసుకోవడం కోసం నేను ఇంటి దగ్గర ఉండిపోయా.

–ఈరన్న, మొలకలపెంట

త్వరలో పనులు కల్పిస్తాం



మొలకలపెంటలో ఇంతవరకూ ఫీల్డ్ అసిస్టెంట్ నియామకం జరగలేదు. నాయకుల సూచనల మేరకు ఒక పేరును పరిశీలించినప్పటికీ.. నిబంధనల మేరకు అతడికి ఉపాధి పనుల్లో అనుభవం లేకపోవడంతో పెండింగ్‌లో ఉంచాం. గ్రామస్తుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని త్వరలోనే పనులు కల్పించేందుకు చర్యలు చేపడతాం.

– క్రిష్ణమూర్తి, ఉపాధి ఏపీఓ

క్లుప్తంగా

రోగులకు నాణ్యమైన సేవలందాలి

- వైద్య ఆరోగ్య శాఖ స్టేట్ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ అనిల్‌కుమార్


రికార్డులు పరిశీలిస్తున్న అనిల్‌కుమార్

అనంతపురం మెడికల్: రోగులకు నాణ్యమైన సేవలందించాలని సంబంధిత అధికారులను వైద్య ఆరోగ్యశాఖ స్టేట్ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ అనిల్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం ఆయన అనంతపురంలోని ఆదిమూర్తినగర్‌లోని పట్టణ ఆరోగ్య కేంద్రం, రుద్రంపేటలోని విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. రోగులకు అందించిన సేవలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అనంతరం హెల్త్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ విధానానికి సంబంధించిన రిపోర్టులు, ఓపీ సేవల వివరాలు, మాతాశిశు సంరక్షణకు ప్రభుత్వం రూపొందించిన మార్గదర్శకాల అమలుపై సిబ్బందితో సమీక్షించారు. వైద్య సేవల్లో నాణ్యత పెంచడానికి మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన వెంట డీఐఓ డాక్టర్ యుగంధర్, ఎన్‌హెచ్‌ఎం కిషోర్, ఫణి ఉన్నారు.

అమ్మలా లాలిస్తూ అక్షరాలు నేర్పండి


మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న

కూడేరు: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులను అమ్మలా లాలిస్తూ అక్షరాలు, మంచి నడవడిక నేర్పుతూ వారి ఉజ్వల భవితకు పునాదులు వేయాలని కార్యకర్తలకు అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న పిలుపునిచ్చారు. 'పునాది స్థాయి అక్షరాస్యత, సంఖ్యా శాస్త్రం(ఎఫ్‌ఎల్‌ఎన్)' కార్యక్రమం అమలుపై అంగన్‌వాడీ కార్యకర్తలకు కూడేరులోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆరు రోజుల శిక్షణా తరగతులను మంగళవారం డీఈఓ ప్రసాద్‌బాబుతో కలసి ఆమె ప్రారంభించారు. సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్(ఎస్ఎస్ఏ ఏపీసీ) శైలజ, ఏఎంఓ చంద్రశేఖర్‌రెడ్డి, ఐసీడీఎస్ పీడీ వనజా అక్కమ్మ హాజరయ్యారు. వినూత్న మాట్లాడుతూ.. అంగన్‌వాడీ స్థాయిలోనే పిల్లలకు చదువులపై ఆసక్తి పెంపొందేలా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. పిల్లల పోషణపై అలసత్వం వీడాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీదేవి, ఏసీడీపీఓ యల్లమ్మ, ఎంఈఓలు-1, 2 మహమ్మద్ గౌస్, సాయికృష్ణ, సూపర్ వైజర్లు రాజేశ్వరి, అరుణ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చికెన్ కర్రీస్ కాదు.. బర్డ్‌ఫ్లూ వైరస్ వర్రీనే ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని జిల్లాల్లో బర్డ్‌ఫ్లూ కేసులు నమోదు కావడంతో ప్రభుత్వం అప్రమత్తమై పశుసంవర్ధక శాఖ ద్వారా చర్యలు చేపట్టింది. దీంతో కోడి మాంసం కొనుగోలుదారులు లేక జిల్లాలోని చికెన్ సెంటర్లు వెలవెలబోతున్నాయి.

చికెన్ కర్రీ... వైరస్ వర్రీ





- బర్డ్‌ఫ్లూ ఎఫెక్ట్‌తో చికెన్ సేల్స్ ఢమాల్
- సగానికి పైగా తగ్గిన వ్యాపారం
- కొనుగోలుదారులు లేక చికెన్ సెంటర్ల వెలవెల
- ఆందోళనలో పౌల్ట్రీ పరిశ్రమ నిర్వాహకులు


కొనుగోలుదారులు లేక బోసిపోయిన తాడిపత్రిలోని చికెన్ సెంటర్

తాడిపత్రి రూరల్: జిల్లాలోని చికెన్ సెంటర్లపై బర్డ్ ఫ్లూ ప్రభావం పడింది. ఉభయ గోదావరి జిల్లాల్లో బర్డ్ ఫ్లూ వ్యాపించి లక్షలాది కోళ్లు మృత్యువాత పడడం జిల్లా ప్రజలను కలవరపెడుతోంది. జిల్లాలో బర్డ్ ఫ్లూ ప్రభావం లేదని పశు సంవర్ధక శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నా.. ప్రజల్లో మాత్రం భయం వీడడం లేదు. చికెన్ తిని లేనిపోని తలనొప్పులు తెచ్చుకోవడం ఎందుకు అనే ధోరణి సర్వత్రా వ్యక్తమవుతోంది. దీంతో కొనుగోలుదారులు లేక చికెన్ సెంటర్లు వెలవెలపోతున్నాయి. ఫలితంగా పౌల్ట్రీ పరిశ్రమ కుదేలవుతోంది. రూ.లక్షలు పెట్టుబడి పెట్టి కోళ్ల పెంపకం చేపట్టిన వారు ఆర్థికంగా నష్టాలు చవిచూస్తున్నారు.

కర్ణాటక నుంచే దిగుమతి

జిల్లాలోని కంబదూరు, కళ్యాణదుర్గం, కుందుర్పి, పామిడి తదితర ప్రాంతాల్లో పౌల్ట్రీ పరిశ్రమ విస్తరించింది. పేరొందిన వెంకోబ్, సుగుణ,స్నేహ, లోటస్ తదితర కంపెనీలు ఆయా ప్రాంతాల్లో రైతులకు కోడి పిల్లలను పంపిణీ చేసి పెంపకాలను ప్రోత్సహిస్తున్నాయి. ఇప్పటి వరకూ జిల్లాలోని పౌల్ట్రీ పరిశ్రమ నుంచే మిగిలిన ప్రాంతాలకు కోళ్లు సరఫరా అయ్యేవి. బర్డ్‌ఫ్లూ ప్రభావం కారణంగా ప్రస్తుతం కర్ణాటక ప్రాంతంలోని బెంగళూరు, పావగడ, చిక్కబళ్లాపూర్, దొడ్డబళ్లాపురం, చిత్రదుర్గ ప్రాంతల నుంచి కోళ్లను దిగుమతి చేసుకుంటున్నారు.

నెలకు 20 లక్షల కిలోలకు పైగా అమ్మకాలు

జిల్లా వ్యాప్తంగా 1,500 నుంచి 2వేల వరకు చికెన్ సెంటర్లు ఉన్నాయి. ఆయా చికెన్ సెంటర్ల నుంచి నెలకు 20లక్షల కిలోలకు పైగా అమ్మకాలు జరుగుతుండేవి. పండుగలు, ఇతర శుభ కార్యా ల్లో దీనికి అదనంగా విక్రయాలు సాగేవి. వందల సంఖ్యలో కుటుంబాలు చికెన్ కబాబ్ బండ్లు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాయి. దాదాపు 10వేల మందికి పైగా స్థానికులు, స్థానికేతరులు నెలసరి జీతాలకు పనిచేస్తున్నారు. ప్రస్తుతం బర్డ్ ఫ్లూ ప్రభావంతో వీరి జీవనం దుర్భరంగా మారింది. సగానికి పైగా వ్యాపారం పడిపోవడంతో చికెన్ విక్రేతలు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సెంటర్ల నిర్వహణకు తీసుకున్న గదులకు సంబంధించి అద్దెలు చెల్లించలేక నిర్వాహకులు ఇబ్బంది పడుతున్నారు. అద్దెలు, కార్మికులు, విద్యుత్ బిల్లులు, ఇతర నిర్వహణ ఖర్చులకు అప్పులు చేయాల్సి వస్తోందని వాపోతున్నారు.

పశు సంవర్ధక శాఖ అప్రమత్తత

జిల్లాల్లో బర్డ్ ఫ్లూపై పశుసంవర్ధక శాఖ అప్రమత్తంగా ఉంది. కోస్తా ప్రాంతంలో కనిపించిన బర్డ్ ఫ్లూ వైరస్ జిల్లాను తాకకుండా ప్రతి మండలానికి ర్యాపిడ్ రెస్పాన్స్ టీం (ఆర్ఆర్‌టీ)ను ఏర్పాటు చేసింది. ఇందులో వెటర్నరీ డాక్టర్‌తో పాటు నలుగురు సిబ్బందిని అందుబాటులో ఉంచారు. ఈ బృందాలు పౌల్ట్రీ పరిశ్రమలను పరిశీలించి కోళ్లకు వైద్యపరీక్షలు నిర్వహిస్తాయి. అనుమానిత కోళ్ల నుంచి నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపుతున్నారు.

సగానికి పైగా వ్యాపారం తగ్గింది



బర్డ్ ఫ్లూ ప్రభావంతో చికెన్ వ్యాపారం సగానికి పైగా పడిపోయింది. ఇది ఎంత కాలం ఉంటుందో తెలియడం లేదు. దుకాణం అద్దె, లేబర్‌కు వేతనాలు, కరెంటు బిల్లుల చెల్లించేందుకు అప్పులు చేయాల్సి వస్తోంది.
– శంకర్‌రెడ్డి, చికెన్ సెంటర్ నిర్వాహకుడు, తాడిపత్రి

చికెన్ మానేశాం



బ్రాయిలర్ కోళ్లకు బర్డ్‌ఫ్లూ వైరస్ వ్యాపించిందనే విషయం తెలిగానే అప్రమత్తమయ్యాం. దీంతో మా ఇంట్లో చికెన్ తినడం మానేశాం. ధర ఎక్కువైనా అప్పుడప్పుడు మటన్ తెచ్చుకుంటున్నాం.
– అల్లీపీరా, తాడిపత్రి

జిల్లాలో బర్డ్ ఫ్లూ లేదు



వదంతులను నమ్మొద్దు. ఇప్పటి వరకూ జిల్లాలో ఎక్కడే గాని బర్డ్‌ఫ్లూ ప్రభావం లేదు. పశుసంవర్ధక శాఖ అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. మండలానికి రెండు చొప్పున ఆర్ఆర్‌టీంలు ఏర్పాటు చేశారు. ఈ బృందాల ద్వారా ముందస్తు చర్యలు తీసుకున్నారు. ఒకవేళ భయం వెన్నాడుతుంటే హాఫ్ బాయిల్డ్ ఎగ్, ఆమ్లెట్ అస్సలు తినొద్దు. గ్రిల్డ్ చికెన్, ఉడికీ ఉడకని చికెన్ తినొద్దు. చికెన్‌ను 160 ఫారెన్ హీట్ వేడిలో వండుకుని తింటే మంచిది.
– సుబ్బారెడ్డి, వెటర్నరీ డాక్టర్, తాడిపత్రి

ఎస్ఈ సంపత్ బదిలీ అశాస్త్రీయం

- మాజీ మంత్రి సాకే శైలజానాథ్

అనంతపురం కార్పొరేషన్: ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సూపరింటెండెంట్ ఇంజినీర్ (ఎస్ఈ) సంతప్‌కుమార్ బదిలీ పూర్తి అశాస్త్రీయంగా ఉందని, వెంటనే ఈ బదిలీని ఆపాలని ప్రభుత్వాన్ని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నేత డాక్టర్ సాకే శైలజానాథ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. దళిత సామాజిక వర్గానికి చెందిన సంపత్‌కుమార్ విధి నిర్వహణలో నిక్కచ్చిగా వ్యవహరించేవారన్నారు. ఎలాంటి తప్పుడు ఆరోపణలు లేకున్నా కొందరి ప్రయోజనాల కోసం ఆయనను బదిలీ చేయడం సరికాదన్నారు. బడుగు బలహీన వర్గాలకు అండగా ఉంటామని కూటమి ప్రభుత్వం పదే పదే చెబుతున్నా.. ఆచరణలో కనీసం కనుచూపు మేరలోనూ కనిపించడం లేదని ఎద్దేవా చేశారు. సంపత్ కుమార్ విషయంలో ఉన్నతాధికారుల తీరును తప్పుబట్టారు.

యూట్యూబ్ చానల్ నిర్వాహకుడి మృతదేహం లభ్యం


తిరుమలరెడ్డి మృతదేహాన్ని వెలికి తీస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: కనిపించకుండా పోయిన యూట్యూబ్ చానల్ నిర్వాహకుడు 24 గంటలు గడవక ముందే హంద్రీనీవా కాలువలో మృతదేహమై తేలాడు. పోలీసులు తెలిపిన మేరకు... గుంతకల్లుకు చెందిన యూట్యూబ్ చానల్ నిర్వాహకుడు తిరుమలరెడ్డి (45) గత ఆదివారం బుగ్గ సంగాల క్షేత్రం సమీపంలో అదృశ్యమైన విషయం తెలిసిందే. కాగా, ఆయన మృతదేహం గుంతకల్లు-మద్దికెర మార్గంలోని హంద్రీ-నీవా ప్రధాన కాలువలో సోమవారం కొట్టుకువచ్చింది. తల, ముఖం, కాళ్లపై ఉన్న గాయాలను బట్టి తిరుమలరెడ్డి హత్యకు గురైనట్లు పోలీసులు నిర్ధారించారు. మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చి పోస్టుమార్టం నిమిత్తం గుంతకల్లులోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కాగా, తిరుమలరెడ్డి అదృశ్యమైన ప్రాంతంలో దెబ్బతిన్న ఆయన బైక్ తప్ప ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. హతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్న అంశాలు, వ్యక్తుల పేర్లను పరిగణనలోకి తీసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఓ అనుమానితుడిని ఇప్పటికే తమ అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. తిరుమలరెడ్డి హత్యకు గురైనట్లు తెలిసిన వెంటనే వైఎస్సార్‌సీపీ నేత మంజునాథరెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆస్పత్రికి చేరుకుని తిరుమలరెడ్డి మృతదేహాన్ని పరిశీలించారు. హతుడి భార్య, కుమార్తె, కుటుంబసభ్యులను ఓదార్చి, ధైర్యం చెప్పారు.

రైతు ఆత్మహత్య

యల్లనూరు: జీవితంపై విరక్తితో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... యల్లనూరు మండలం పెద్దమల్లేపల్లి గ్రామానికి చెందిన రైతు ఆంధ్ర శ్రీనివాసుల నాయుడు (62) భార్య పదేళ్ల క్రితమే మృతిచెందింది. అప్పటి నుంచి తన కుమారుడితో కలసి ఆయన ఉంటున్నాడు. కొంత కాలంగా అనారోగ్య సమస్యతో బాధపడుతున్న ఆయన పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నాడు. అయితే వ్యాధి నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి పెంచుకున్న శ్రీనివాసుల నాయుడు సోమవారం రాత్రి తన పాత ఇంట్లో నిల్వ చేసిన పురుగుల మందు తాగాడు. కాసేపటి తర్వాత తన స్నేహితుడు సద్దల చంద్రమౌళీశ్వరరెడ్డి ఫోన్ చేసి తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు తెలిపాడు. వెంటనే స్పందించిన ఆయన, శ్రీనివాసులు నాయుడు కుమారుడు మధుసూదన్‌నాయుడు, బంధువులతో కలసి పాత ఇంటి వద్దకు చేరుకున్నారు. అపస్మారక స్థితికి చేరుకున్న శ్రీనివాసుల నాయుడిని తాడిపత్రిలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతిచెందినట్లు నిర్ధారించారు. మధుసూదన్‌నాయుడు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఆత్మహత్యకు ప్రేరేపించిన కేసులో ఇద్దరి అరెస్ట్

ఉరవకొండ: వ్యక్తిని ఆత్మహత్యకు ప్రేరేపించిన కేసులో ఇద్దరిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. మంగళవారం ఉరవకొండ పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను ఎస్ఐ జనార్దననాయుడు వెల్లడించారు. స్థానిక కుమ్మర వీధిలో నివాసముంటున్న కిషోర్‌కుమార్ (39), దాసరి కేదార్‌నాథ్, కమ్మరి హరికృష్ణ, మరో ఇద్దరు స్నేహితులు. ముగ్గురూ కొంత కాలంగా ఆన్‌లైన్ బెట్టింగ్ ఆడేవారు. ఈ క్రమంలో రూ.9 లక్షల వరకూ నష్టపోయారు. దీంతో కిషోర్‌కుమార్ ప్రమేయం వల్లనే తాము నష్టపోయామని, ఆన్‌లైన్ బెట్టింగ్‌లో పోగొట్టుకున్న డబ్బు మొత్తాన్ని చెల్లించాల్సిందేనంటూ కొంత కాలంగా నలుగురు స్నేహితులూ తీవ్ర ఒత్తిడి చేశారు. ఈ క్రమంలోనే ఇంటి వద్ద గొడవ చేసి మాటలతో హింసించారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన కిషోర్‌కుమార్ ఈ నెల 8న ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మంగళవారం ఉదయం ఉరవకొండ శివారున కేదార్‌నాథ్, హరికృష్ణను అరెస్ట్ చేసి, న్యాయస్థానం ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న మరో ఇద్దరి కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పథకాలు దూరం చేసేందుకే 'భూ ఆధార్'

- నమోదు ప్రక్రియను వెంటనే ఆపేయాలి
- సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప డిమాండ్



అనంతపురం అర్బన్: రైతులకు సంక్షేమ ఫలాలు దూరం చేసేందుకే రైతు విశిష్ట సంఖ్య (భూ ఆధార్) నమోదుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, వెంటనే ఈ ప్రక్రియను ఆపేయాలంటూ కూటమి సర్కార్‌ను సీపీఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక గణేనాయక్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో ఆగమేఘాలపై రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. ఇందులో భాగంగానే గడువు నిర్దేశించి, ఈ లోపు ఈ ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసిందన్నారు. భూ ఆధార్ నమోదు చేసుకున్న వారికి మాత్రమే పీఎం కిసాన్ సమ్మాన్ నిధి, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం, పంటల బీమా వంటి సంక్షేమ పథకాలు వర్తిస్తాయని, నమోదు చేసుకోకపోతే పథకాలు వర్తించవంటూ ఓ విధంగా రైతులను రాష్ట్ర ప్రభుత్వం బ్లాక్‌మెయిల్ చేస్తోందని మండిపడ్డారు. జిల్లాలో 70 శాతం మంది రైతులు ప్రభుత్వం నుంచి అసైన్‌మెంట్ భూములను పొందినవారే ఉన్నారన్నారు. భూ ఆధార్ నమోదు ప్రక్రియతో వీరంతా తీవ్రంగా నష్టపోతారన్నారు. భూమి లేని లక్షల మంది కౌలురైతులకు ఎలాంటి గుర్తింపు ఉండదన్నారు. వీరికి సంక్షేమ పథకాలు వర్తించవన్నారు. అలాగే చుక్కల భూములు ఉన్న రైతుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చూపకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. కేంద్రీయ విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు రక్షణ కల్పించాలని నల్లప్ప డిమాండ్ చేశారు. విద్యార్థులకు రక్షణ కల్పించడంలో, సమస్యల పరిష్కారంలో విఫలమైన వీసీని తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు.

జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో రాణించిన 'గురుకుల' విద్యార్థులు


ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో పాఠశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి

బుక్కరాయసముద్రం: ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు మహారాష్ట్రలో జరిగిన జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో బీకేఎస్ మండలం కొర్రపాడులో ఉన్న ఎస్సీ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. లాంగ్‌జంప్ పోటీల్లో 8వ తరగతి విద్యార్థి ఇందు, 6వ తరగతి విద్యార్థి నవ్యశ్రీ వెండి పతకాలు సాధించారు. ప్రతిభ చాటిన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ శ్యామలాదేవి, పీఈటీలు వరలక్ష్మి, తేజస్విని, హేమ, శ్యామలమ్మ అభినందించారు.

కాలువలో పడి విద్యార్థి మృతి


జానీ (ఫైల్)

గుమ్మఘట్ట: ప్రమాదవశాత్తు సాగునీటి కాలువలోని నీటి ప్రవాహంలో పడి ఓ విద్యార్థి మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన మేరకు... బేలోడుకు చెందిన అన్నపూర్ణకు 11 సంవత్సరాల క్రితం గలగల గ్రామానికి చెందిన లోకేష్‌తో వివాహమైంది. అనారోగ్యంతో 2020లో అన్నపూర్ణ మృతి చెందింది. అప్పటి నుంచి వారి కుమారుడు జాని పోషణను అమ్మమ్మ హనుమక్క, తాత హనుమప్ప తీసుకున్నారు. ప్రస్తుతం జాని (7) బేలోడులోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రెండో తరగతి చదువుతున్నాడు. మంగళవారం ఉదయం పాఠశాలకు వెళ్లిన జాని.. మధ్యాహ్నం తోటి స్నేహితుడు లక్కీతో కలసి గ్రామ సమీపంలోని బీటీపీ సాగునీటి కాలువ వద్దకెళ్లాడు. అప్పటికే సిద్ధంగా ఉంచుకున్న గాలాన్ని తీసి కాలువలో వేసే క్రమంలో జాని ప్రమాదవశాత్తు అదుపు తప్పి నీటిలో పడిపోయాడు. ఆ సమయంలో లక్కీ కేకలు విన్న చుట్టుపక్కల పొలాల్లోని రైతులు అక్కడకు చేరుకుని జానీని వెలికి తీశారు. అపస్మారక స్థితికి చేరుకున్న బాలుడిని వెంటనే రాయదుర్గంలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళితే.. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

చికోటి ప్రవీణ్ వివాదాస్పద వ్యాఖ్యలు



మాట్లాడుతున్న చికోటి ప్రవీణ్

గుంతకల్లు టౌన్: ధర్మరక్ష వ్యవస్థాపకుడు, తెలంగాణ బీజేపీ నేత చికోటి ప్రవీణ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా బీజేవైఎం ఆధ్వర్యంలో మంగళవారం గుంతకల్లు పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పొట్టిశ్రీరాములు సర్కిల్‌లో ఏర్పాటు చేసిన సభనుద్దేశించి చికోటి ప్రవీణ్ మాట్లాడుతూ.. మత ప్రబోధకుల్లో 90 శాతం మంది సరిగా లేరంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఇక్కడ నినదిస్తే హైదరాబాద్‌లోని ఒవైసీతో పాటు ఇతరులకు వణుకు పుట్టాలంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. ఇవాళ ప్రతిచోటా హిందుత్వానికి శత్రువులు ఎక్కువయ్యారని, సెక్యులర్ వాదులను తాను శిఖండీలుగా అభివర్ణిస్తున్నానని అన్నారు.

చెలరేగిన 'కేబుల్' దొంగలు

యాడికి: మండలంలోని చందన గ్రామంలో కేబుల్ దొంగలు చెలరేగారు. తొమ్మిది మంది రైతులు బోరు బావులకు అనుసంధానం చేసిన విద్యుత్ కేబుల్‌ను సోమవారం రాత్రి కత్తిరించి ఎత్తుకెళ్లారు. మంగళవారం ఉదయం పంట పొలాలకు నీరు పెట్టేందుకు వెళ్లిన రైతులు విషయాన్ని గుర్తించి లబోదిబోమన్నారు. ప్రతి బోరు బావి వద్ద స్టార్టర్ పెట్టెలోని ఫీజులు తొలగించి, కేబుల్ వైర్లు కత్తిరించి అపహరించడం గమనార్హం. ఘటనతో ప్రతి రైతు రూ. వెయి, నుంచి రూ. 2వేల వరకూ నష్టం వాటిల్లింది. ఘటనపై పోలీసులకు బాధిత రైతులు ఓంకారయ్య, మధు, రామకృష్ణ, నాగేంద్ర, నాగయ్య, ఆదిరంగారెడ్డి తదితరులు ఫిర్యాదు చేశారు.

సరైన చికిత్సతో వంకర పాదాల సమస్య దూరం


చిన్నారికి చికిత్స చేస్తున్న డాక్టర్ బ్రూస్‌స్మిత్


అనంతపురం మెడికల్: సరైన చికిత్సను అందివ్వడం ద్వారా చిన్నారుల్లో వంకర పాదాల సమస్యను నయం చేయవచ్చునని అమెరికాకు చెందిన క్యూర్ ఇంటర్నేషనల్ ట్రస్ట్ ట్రైనర్ డాక్టర్ బ్రూస్‌స్మిత్ సూచించారు. ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని డీఈఐసీను మంగళవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆర్థో విభాగాన్ని పరిశీలించి, అక్కడ అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా వంకర పాదాలతో ఇబ్బంది పడుతున్న పలువురు చిన్నారులకు స్వయంగా చికిత్స చేయడంతో పాటు చికిత్స విధానాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 2018 సంవత్సరం నుంచి ఇప్పటి వరకూ వంకరపాదాలతో ఇబ్బంది పడిన 78 మంది పిల్లలకు క్యూర్ ఇండియా సంస్థ తరఫున డీబీ స్ప్లిట్‌లను ఉచితంగా అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్థో హెచ్ఓడీ డాక్టర్ ఆత్మారాం, వైద్యులు డాక్టర్ సతీష్, రాష్ట్రీయ బాల ఆరోగ్య కార్యక్రమాధికారి డాక్టర్ నారాయణస్వామి పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి వృషభాల బల ప్రదర్శన


రాతి దూలాన్ని లాగుతున్న వృషభాలు

గుత్తి రూరల్: మండలంలోని తొండపాడు గ్రామంలో వెలసిన బొలికొండ రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వృషభాల బలప్రదర్శన మంగళవారం ముగిసాయి. ఆరు పళ్లు, న్యూ కేటగిరి, సీనియర్ విభాగాల్లో జరిగిన పోటీలు హోరాహోరీగా సాగాయి. అనంతపురం, కర్నూలు, వైఎస్సార్, నంద్యాల, అన్నమయ్య జిల్లాలకు చెందిన వృషభాలు పాల్గొన్నాయి. సీనియర్ విభాగం పోటీల్లో నంద్యాల జిల్లా గుంపరమానుదిన్నెకు చెందిన రైతు కుందూరు రాంభూపాల్‌రెడ్డి వృషభాలు మొదటి స్థానం, వైఎస్సార్‌జిల్లా కల్లూరుకు చెందిన రైతు పెరుమాల్ శివకృష్ణయాదవ్ వృషభాలు రెండవ స్థానం, అనంతపురం రూరల్ మండలం ఎ.నారాయణపురానికి చెందిన రైతు ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి వృషభాలు మూడవ స్థానంలో నిలిచాయి. విజేత వృషభాల యజమానులను అభినందిస్తూ నగదు ప్రోత్సాహకాలను ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడుయాదవ్ అందజేశారు. అలాగే సీనియర్ విభాగంలో మొదటి స్థానంలో నిలిచిన వృషభాల యజమానికి ఓ పాడి ఆవును రైతులు రమేష్‌రెడ్డి, చిలుకూరు కుమార్‌రెడ్డి బహుమతిగా ఇచ్చారు. కార్యక్రమంలో నిర్వాహకులు చిన్నరెడ్డి యాదవ్, రంగస్వామిరెడ్డి యాదవ్, లక్ష్మీరంగయ్య పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య


మృతుడు ఈశ్వర్

కణేకల్లు: మండలంలోని 43 ఉడేగోళం గ్రామానికి చెందిన బోయ ఈశ్వర్ (26) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... నిరుపేద కుటుంబానికి చెందిన ఈశ్వర్‌కి రెండేళ్ల క్రితం డి.హిరేహాళ్ మండలం పులకుర్తి గ్రామానికి చెందిన కావేరితో వివాహమైంది. వీరికి ఏడాది వయసున్న కుమారుడు ఉన్నాడు. కూలీ పనులతో కుటుంబాన్ని పోషించుకునే ఈశ్వర్ కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. తాగుడు మానేయమని భార్య పలుమార్లు ప్రాధేయపడినా ఫలితం లేకపోయింది. దీంతో మనస్థాపం చెందిన ఆమె కుమారుడిని పిలుచుకుని మంగళవారం సాయంత్రం తన పుట్టింటికెళ్లింది. దీంతో అత్తింటి వారు మందలిస్తారేమోననే అనుమానంతో మంగళవారం రాత్రి 7.30 గంటలకు తాము నివాసముంటున్న గుడిసెలోనే ఈశ్వర్ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆలస్యంగా విషయాన్ని గుర్తించిన చుట్టుపక్కల వారి సమాచారంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

వివాహిత దుర్మరణం

కణేకల్లు: ద్విచక్ర వాహనంఅదుపు తప్పి కింద పడిన ఘటనలో ఓ వివాహిత దుర్మరణం పాలైంది. పోలీసులు తెలిపిన మేరకు... ఉరవకొండ మండలం రాకెట్ల గ్రామానికి చెందిన సత్యనారాయణ, అనసూయమ్మ (38) దంపతులు. మంగళవారం ఉదయం బొమ్మనహాళ్ మండలంలోని కృష్ణాపురంలో జరిగిన బంధువుల పెళ్లికి తన భార్యతో కలసి ద్విచక్ర వాహనంపై సత్యనారాయణ వెళ్లాడు. అనంతరం రాయదుర్గం మండలంలోని కదరంపల్లిలో ఉన్న అత్తారింటికి బయలుదేరాడు. సాయంత్రం 6 గంటల సమయంలో కణేకల్లు క్రాస్‌లోని ఆర్డీటీ ఆస్పత్రి వద్దకు చేరుకోగానే రోడ్డుకు అడ్డంగా వచ్చిన కుక్కను తప్పించే క్రమంలో వాహనం అదుపు తప్పి ఇద్దరూ కిందపడ్డారు. ఘటనలో తలకు బలమైన గాయం కావడంతో అనసూయమ్మ అక్కడికక్కడే మృతిచెందింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

క్లుప్తంగా

మృతుడి కుటుంబానికి పరామర్శ



రాజప్ప మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న గోరంట్ల మాధవ్

రామగిరి: మండలంలోని గంతిమర్రి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత గొల్లరాజప్ప (52) మంగళవారం అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికారప్రతినిధి గోరంట్లమాధవ్ గ్రామానికి చేరుకుని గొల్లరాజప్ప మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి భార్య రామలక్ష్మి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. రాజప్ప కుటుంబానికి పార్టీ అన్నివిధాలుగా అండగా ఉంటుందని భరోసా కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ చెన్నకేశవరెడ్డి, ఎంపీటీసీ కొండన్న, నాయకులు పాల్గొన్నారు.

ఉచిత కుళాయి కనెక్షన్లపై హర్షం

రాప్తాడురూరల్: సంత్‌గురు రవిదాస్ కాలనీలో దివ్యాంగుల నివాసాలకు సర్పంచ్ సావిత్రి శ్రీనివాసులు చొరవతో ఉచితంగా నీటి కుళాయి కనెక్షన్లు మంజూరు చేశారని దివ్యాంగులు పేర్కొన్నారు. సర్పంచ్‌గా ఎన్నికై నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం సర్పంచ్‌ను ఘనంగా సన్మానించారు. దివ్యాంగులను దృష్టిలో ఉంచుకుని సర్పంచ్ సొంత నిధులతో ప్రతి ఇంటికి ఉచితంగా కుళాయి కనెక్షన్లు ఇప్పించారని పేర్కొన్నారు. అలాగే ఇంటి గుత్తలు కూడా పంచాయతీ నుంచి ఉచితంగా ఇప్పించారన్నారు. ఏపీ దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ హరినాథ్‌రెడ్డి, కార్యదర్శి రంగస్వామి, దివ్యాంగులు శంకరప్ప, తిరుపాలు, కదిరప్ప పాల్గొన్నారు.

'శ్రీ చైతన్య' విద్యార్థులకు అభినందనలు



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న ఏజీఎం సుబ్బారెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: సీఏటీ, పీఏటీ, ఎంఏటీ పరీక్షల్లో విజయం సాధించిన స్థానిక కోర్టు రోడ్‌లోని శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులను అభినందించారు. మంగళవారం పాఠశాలలో కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆయా పరీక్షల్లో విజయం సాధించిన విద్యార్థులకు ఏజీఎం సుబ్బారెడ్డి ప్రశంసాపత్రాలు, క్యాష్ అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఏజీఎం మాట్లాడుతూ ఇలాంటి పరీక్షల్లో ఘన విజయాన్ని సాధించడం ఆనందంగా ఉందన్నారు. కరువు జిల్లా అనంతపురంలో ఇలాంటి ఆణిముత్యాలను వెలికితీయడంలో శ్రీ చైతన్య విద్యాసంస్థల ఉపాధ్యాయుల పాత్ర ఎంతో ఉందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తబుస్సుమ్, ఏఓ గోపాల్, అకడమిక్ కో–ఆర్డినేటర్ ఇర్షాద్, డీన్లు అప్పలనాయుడు, సిరాజుద్దీన్ పాల్గొన్నారు.

డిపాజిట్లపై రోడ్‌షో



రోడ్‌షోలో పాల్గొన్న కెనరాబ్యాంకు ఏజీఎం లారెన్స్, ఉద్యోగులు

అనంతపురం అగ్రికల్చర్: డిపాజిట్ పథకాలు సద్వినియోగం చేసుకోవాలంటూ కెనరాబ్యాంకు ఆధ్వర్యంలో మంగళవారం రోడ్‌షో చేపట్టారు. బ్యాంకు ఏజీఎం లారెన్స్ ఆధ్వర్యంలో స్థానిక టవర్‌క్లాక్, సప్తగిరి సర్కిల్, శ్రీకంఠం సర్కిల్ ప్రాంతాల్లో బ్యాంకు అధికారులు, ఉద్యోగులు రోడ్‌షోలో పాల్గొన్నారు. మిగతా అన్ని బ్యాంకుల కన్నా డిపాజిట్లపై కెనరాబ్యాంకు 8 శాతం వడ్డీ రేటు వర్తింపజేసిందన్నారు. మహిళా ఖాతాదారుల కోసం ప్రత్యేకంగా 'కెనరా ఏంజెల్' స్కీమ్ అమలు చేస్తున్నామని తెలిపారు. రైతులతో పాటు అన్ని వర్గాలు, అన్ని రంగాల అభ్యున్నతి కోసం తక్కువ వడ్డీరేట్లతో విరివిగా రుణాలు అందిస్తున్నామన్నారు. ప్రాంతీయ కార్యాలయ సీనియర్ మేనేజర్లు, బ్రాంచి మేనేజర్లు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

భూకబ్జాపై కేసు నమోదు

అనంతపురం: భూకబ్జాకు పాల్పడిన ఐదుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. నగరంలోని కమలానగర్‌కు చెందిన డాక్టర్ కాటం వీరభద్రయ్య, డాక్టర్ బాలాకుమారి దంపతులు గుత్తి రోడ్డు సమీపంలోని సర్వే నెంబర్ 89/4బీలో 38 సెంట్లు, సర్వే నెంబర్ 94లో 12.67 సెంట్ల భూమిని 2007, 2009లో కొనుగోలు చేశారు. గత నెల 17న కొంత మంది వ్యక్తులు ప్రజా సంఘం పేరుతో తాత్కాలిక గుడిసెలు నిర్మించారు. బాధితులు తమ భూమి వద్దకు వెళ్లగా, కొందరు వ్యక్తులు వారిని తిట్టి బెదిరించారు. డాక్టర్ కాటం వీరభద్రయ్య ఫిర్యాదు మేరకు అనంతపురం మూడో పట్టణ పోలీసులు ఐదుగురు నిందితులపై భూకబ్జా (ల్యాండ్ గ్రాబింగ్) సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. భూ కబ్జాకు పాల్పడితే చర్యలు తప్పవని సీఐ శాంతిలాల్ హెచ్చరించారు.

కరుణించు కాశీవిశ్వేశ్వరా

- మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైన ఆలయం
- నేటి నుంచి ఉత్సవాలు



కాశీవిశ్వేశ్వరుడు



కాశీ విశ్వేశ్వరాలయం

అనంతపురం కల్చరల్: పవిత్ర మాఘమాసం ముగింపు చేరుకునే దశలో వచ్చే అతి పెద్ద పర్వదినం మహాశివరాత్రి. జిల్లాలోనే అత్యంత ఘనంగా సాగే శైవ క్షేత్రాల్లో నగరంలోని పురాతన కాశీవిశ్వేశ్వరాలయం ముందు వరుసలో ఉంటుంది. పది రోజుల పాటూ అంగరంగ వైభవంగా సాగే వేడుకలకు శివాలయం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. మహాశివుడు తపస్సు చేసుకునే భంగిమలో ఆలయం బయటే దర్శనమిచ్చే ప్రతిరూపంతో, విద్యుద్దీప కాంతుల నడుమ ఆలయం మహాశివరాత్రి పర్వదిన వేడుకలను భక్తులకు ఆహ్వానం పలుకుతున్నట్లు సందడిగా మారింది. మహిమాన్విత క్షేత్రంగా పూజలందుకుంటున్న ఈ ఆలయంలో బుధవారం దీక్షా హోమంతో వేడుకలకు అంకురార్పణ చేయనున్నారు.

కాశీ నుంచి మోసుకొచ్చి :

జిల్లాలోని ఎన్నో శైవక్షేత్రాలకున్న ప్రాధాన్యతలకు భిన్నంగా మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వరాలయ చరిత్ర ఆసక్తికరం. వందేళ్ల క్రితం హోసూరు రామస్వామి అనే భక్తుడు స్వయంగా కాశీనగరానికి వెళ్లి అక్కడి పవిత్ర గంగాజలాలతో అభిషేకించిన శివలింగాన్ని మోసుకుని పాదయాత్రగా అనంతలో ప్రతిష్ఠించారు. నాటి నుంచి ఆలయం దినదినప్రవర్ధమానవుతూ ప్రధాన ఆలయాలకు దీటుగా పలు ఉత్సవాలకు, వేడుకలకు ఆలవాలంగా మారింది.

రోజుకొక వాహన సేవ

ఎంత పెద్ద క్షేత్రమైనా ఒకటి రెండు రోజుల్లో ముగిసిపోయేలా కాకుండా మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వరాలయంలో పదిరోజుల పాటూ నిత్య వాహనసేవలు, సాంస్కృతిక సంబరాలతో శ్రీశైలాన్ని తలపిస్తూ ఉత్సవాలు కొనసాగనున్నాయి. ఇందులో భాగంగా 19న రాత్రి మయూర వాహనంపై ఆది దంపతులు భక్తులకు దర్శనమివ్వనున్నారు. 20న వ్యాఘ్రవాహనం, 21న శేషవాహనం, 22న హంస వాహనం, 23న రావణబ్రహ్మ వాహనం, 24న గజ వాహనం, 25న కైలాస వాహనంపై విహరించనున్నారు. 26న మహాశివరాత్రి పర్వదిన సందర్భంగా శివపార్వతుల కల్యాణంతో పాటూ అదేరోజు నంది వాహనంపై దర్శనమివ్వనున్నారు. 27న బ్రహ్మ రథోత్సవం, 28న అశ్వవాహన సేవ, అలకోత్సవం, వచ్చేనెల 01న వసంతోత్సవం, త్రిశూల స్నానంతో వేడుకలు ముగియనున్నాయి.

పూర్వీకులు పవిత్రను ఆపాదించారు



ఇతర ఆలయాలకు భిన్నంగా కాశీవిశ్వేశ్వరాలయం వెలుగొందుతోంది. మా ముత్తాత స్వయంగా నడుస్తూ శివలింగాన్ని తెచ్చిన ఘటన భక్తిభావం పెరగడానికి కారణమైంది. కోరిన కోర్కెలు తీర్చే దేవుడిగా ఇక్కడ ఆదిదేవుడు విశేష పూజలందుకుంటున్నాడు. బుధవారం నుంచి పదిరోజుల పాటూ సాగే మహాశివరాత్రి వేడుకల్లో నిత్య వాహన సేవలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి. భక్తులందరూ భాగస్వాములు కావాలని మనవి.

– హోసూరు రామసుబ్రమణ్యం, అనువంశీకులు

కబ్జా నుంచి స్థలాన్ని కాపాడండి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న బాధితురాలు రామాంజినమ్మ, నాయకులు

రాప్తాడు: కబ్జా నుంచి తన స్థలాన్ని కాపాడాలని ఎం.చెర్లోపల్లి గ్రామానికి చెందిన కడితి రామాంజినమ్మ తహసీల్దార్‌ను కోరారు. ఈమేరకు మంగళవారం వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సాకే వెంకటేష్, మాజీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, నాయకులు చింతకాయల జయన్నతో కలిసి తహసీల్దార్ విజయకుమారికి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ తనతోపాటు తన అక్క నాగరత్నమ్మకు సర్వే నెంబర్ 774–3లో 2 సెంట్ల చొప్పున 2022లో రెవెన్యూ అధికారులు ఇంటి పట్టాలను మంజూరు చేశారన్నారు. ఆర్థిక స్థోమత లేనందున ఇంటి నిర్మాణం చేపట్టలేదని, ప్రస్తుతం ఆ స్థలంలోనే ఇంటి నిర్మాణం చేపట్టాలని అనుకున్నామన్నారు. అయితే గ్రామానికి చెందిన టీడీపీ నేత మోదుపల్లి నాగరాజు ఆ రెండు ప్లాట్స్ తనవేనని, వాటిని వదిలి వెళ్లకుంటే మీ అంతు చూస్తానని బెదిరిస్తున్నాడని వాపోయింది. ఈ విషయంపై సీఐ శ్రీహర్షకు ఫిర్యాదు చేస్తే తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులు ఉంటాయని అక్కడి నుంచి పట్టాలు ఎవరివైతే వారికి న్యాయం చేస్తామని చెప్పాడన్నారు. క్షేత్ర స్థాయిలో విచారించి తమకు న్యాయం చేయాలని ఆమె తహసీల్దార్‌ను కోరింది. బాధితురాలికి న్యాయం చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని నాయకులు పేర్కొన్నారు.

సంక్షిప్త సమాచారం

సెలవులో రూరల్ తహసీల్దార్

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండల తహసీల్దార్ మోహన్‌కుమార్ సెలవుపై వెళ్లారు. తనకూతురు వివాహం నేపథ్యంలో మార్చి 4 వరకు సెలవు పెట్టారు. 5న తిరిగి విధుల్లో చేరనున్నారు. అప్పటిదాకా అర్బన్ తహసీల్దార్ హరికుమార్‌కు ఎఫ్‌ఏసీ బాధ్యతలు అప్పగించారు.

వాహనాల తనిఖీ

అనంతపురం: జిల్లా కేంద్రంలో పోలీసులు మంగళవారం రాత్రి విస్తృతంగా వాహనాల తనిఖీ చేపట్టారు. నాలుగు పోలీస్ స్టేషన్ల పరిధిలోని ప్రధాన రహదారులు, కూడళ్లు, రద్దీ ఉన్న ప్రాంతాల్లో వాహనాలతోపాటు వాటి రికార్డులను పరిశీలించారు. ట్రాఫిక్ ఉల్లంఘనలపై చర్యలు తీసుకున్నారు. హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించడంతో పాటు రహదారి నిబంధనలు పక్కాగా పాటించాలని వాహనదారులకు సూచించారు.

బాలోత్సవంలో సనప విద్యార్థుల ప్రతిభ

ఆత్మకూరు: ఇటీవల జిల్లా కేంద్రంలో నిర్వహించిన బాలోత్సవ కార్యక్రమంలో సనప ఉన్నత పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభ చాటారు. పాఠశాల విద్యార్థులు మ్యాప్ పాయింటింగ్ జూనియర్ విభాగంలో ప్రథమస్థానం, కథలు చెప్పడంలో జూనియర్స్ విభాగంలో తృతీయ స్థానం , మట్టి బొమ్మల విభాగంలో కన్సోలేషన్ బహుమతులు సాధించినట్లు పాఠశాల హెచ్‌ఎం సుధ తెలిపారు. మంగళవారం పాఠశాలలో విద్యార్థులను అభినందించారు. ఉపాధ్యాయులు రమణారెడ్డి, మదన్‌మోహన్, అరుణకుమారి పాల్గొన్నారు.

లక్షల మందికి ఇస్కాన్ అన్నదానం

అనంతపురం కల్చరల్: భక్తులందరి సహకారంతో ఇస్కాన్ ఆధ్వర్యంలో లక్షలాది మందికి శ్రీశైల పాదయాత్రికులకు అన్నదానం చేయనున్నట్లు ఇస్కాన్ జిల్లా ఇన్‌చార్జి దామోదర గౌరంగదాసు అన్నారు. మంగళవారం సాయంత్రం మందిరంలో ఆయన నిర్వాహకులతో కలిసి బ్రోచర్లను ఆవిష్కరించి మాట్లాడారు. శివరాత్రి సందర్భంగా శ్రీశైలానికి ఆత్మకూరు అటవీమార్గం ద్వారా లక్షల సంఖ్యలో పాదయాత్రగా వెళ్తుంటారని అలాంటి వారికి అన్నం దొరకడం కష్టసాధ్యమన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఇస్కాన్ ద్వారా ఈనెల 19 నుంచి 25 వరకు సదామర్లకోట అడవి మార్గంలో ఓ చోట, 25 నుంచి 28 వరకు దోర్నాల చెక్ పోస్టు వద్ద మరోచోట ఇస్కాన్ అన్నదాన క్యాంపులు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమానికి సహకరిస్తున్న వెంకటరెడ్డి, దేవానరేష్, మణికంఠ, రవికాంత్ రమణ, ఫయాజ్, నిత్యానందరెడ్డి, రామకృష్ణ, శరణ్, మల్లికార్జున తదితరులకు ధన్యవాదాలను తెలియజేశారు.

అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతం కోసమే శిక్షణ

రాప్తాడు: అంగన్‌వాడీ కేంద్రాలను మరింత బలోపేతం చేయడానికే శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని ఎంఈఓ మల్లికార్జున పేర్కొన్నారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జ్ఞాన జ్యోతి కార్యక్రమంలో భాగంగా తొలి విడత శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఎంఈఓ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యాభివృద్ధి కోసం వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల విద్యాభ్యాసం ప్రారంభమవుతుందన్నారు. భాషాభివృద్ధి, గణిత సామర్థ్యాలు పెరిగితేనే పిల్లలు అన్ని విషయాల్లో సామర్థ్యాన్ని పొందుతారన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 కుళ్లాయప్ప, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాగరత్న, హేమలత పాల్గొన్నారు.

ఆత్మకూరు: చిన్నారులకు అర్థమయ్యేలా బోధించాలని, ఇందుకోసమే ప్రభుత్వం శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తోందని సీపీడీఓ ధనలక్ష్మి, ఎంఈఓలు నరసింహారెడ్డి, రామాంజినేయులు తెలియజేశారు. మంగళవారం మండల కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లావణ్య, సిబ్బంది పాల్గొన్నారు.

లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు

అనంతపురం మెడికల్: ఆస్పత్రిలో ఎవరైనా సిబ్బంది, రోగులు, వారి సహాయకుల పట్ల లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఆరోపణలు వస్తే కఠిన చర్యలు తప్పవని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు, ఆస్పత్రి ఏడీ మల్లికార్జున రెడ్డి హెచ్చరించారు. ఇటీవల ఓ అనస్తీషియా విద్యార్థిని పట్ల ఎంఎన్‌ఓ అసభ్య ప్రవర్తించడంతో మంగళవారం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో ఎంఎన్‌ఓలతో సమావేశం ఏర్పాటు చేశారు. మహిళలను గౌరవించాలని, ఏమాత్రం బాధ్యతారాహిత్యంగా మాట్లాడినా చర్యలు తప్పవన్నారు. ఆర్‌ఎంఓ డాక్టర్ రామకృష్ణ, డిప్యూటీ ఆర్‌ఎంఓ డాక్టర్ పద్మజ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ ప్రలోభాలకు లోనుకావద్దు



బ్రోచర్ విడుదల చేస్తున్న ఎంపీ అంబికా, మేయర్ వసీం తదితరులు

అనంతపురం కార్పొరేషన్: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన నేషనల్ జియో స్పేషియల్ నాలెడ్జ్ బేస్డ్ ల్యాండ్ సర్వే ఆఫ్ అర్బన్ రీహాబిలిటేషన్(నక్ష) సర్వేలో రాజకీయ ప్రలోభాలకు లోనుకావద్దని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. మంగళవారం గుత్తి రోడ్డులోని ఓ కన్వెన్షన్ హాల్‌లో నక్ష ప్రారంభోత్సవానికి ఎంపీ, మేయర్ వసీం, అహుడా చైర్మన్ వరుణ్, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య హాజరయ్యారు. ఎంపీ మాట్లాడుతూ డిజిటలైజేషన్‌తో ప్రజల ఆస్తులకు భరోసా లభిస్తుందన్నారు. సర్వేతో ప్రభుత్వ స్థలాల కబ్జాకు రక్షణ లభిస్తుందన్నారు. మేయర్ వసీం మాట్లాడుతూ గత ప్రభుత్వం అన్ని మున్సిపాలిటీల్లో రీ సర్వే ప్రారంభించిందన్నారు. నక్ష లక్ష్యాలను అధిగమిస్తే నగరాభివృద్ధికి మూడు దశల్లో రూ.90 కోట్ల నిధులు విడుదల అవుతాయన్నారు. అహుడా చైర్మన్ వరుణ్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 4,900 యూఎల్‌బీలలో అనంతపురం నగరపాలక సంస్థ ఎంపిక కావడం అభినందనీయమన్నారు. అంతకుముందు నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి నక్ష వివరాలను పవర్ పాయింట్ ద్వారా తెలియజేశారు. అనంతరం వారు నక్ష బ్రోచర్‌ను ఆవిష్కరించారు. నగరపాలక సంస్థ ఎస్‌ఈ భాస్కర రావు, ఈఈలు షాకీర్, రాధాకృష్ణ పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదాతలు కండి



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

రాప్తాడు: ప్రమాదాల్లో గాయపడిన బాధితులకు రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని ఎస్‌వీఐటీ ఇంజినీరింగ్ కళాశాల ఎండీ వెన్నపూస రమాకాంత్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. హంపాపురం సమీపంలోని ఎస్‌వీఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఎండీ మాట్లాడుతూ అన్ని దానాల్లో కెల్లా రక్తదానం గొప్పదని, అది ఎన్నో ప్రాణాలను కాపాడుతుందన్నారు. ప్రతిఒక్కరూ విద్యార్థి దశ నుంచే రక్తదానం చేయాలన్నారు. వైద్యాధికారులు జీవన్, శేఖర్ గౌడ్, ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్, ఏఓ వెంకటశివారెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

మాస్టర్ అథ్లెట్ షఫీకి అభినందన



కానిస్టేబుల్ షఫీని అభినందిస్తున్న ఎస్పీ జగదీష్

అనంతపురం: మాస్టర్ అథ్లెటిక్స్ రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చాటిన కానిస్టేబుల్ షఫీని ఎస్పీ జగదీష్ అభినందించారు. ఈ నెల 7, 8, 9 తేదీల్లో నీలం సంజీవరెడ్డి మైదానంలో ఈవెంట్స్ జరిగాయి. ఇందులో కళ్యాణదుర్గం పీఎస్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ షఫీ నాలుగు పతకాలు సాధించి, మార్చి 4న బెంగళూరు వేదికగా ప్రారంభమయ్యే జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాడు. దీంతో మంగళవారం ఎస్పీ జగదీష్ తన చాంబర్‌లో షఫీని ప్రత్యేకంగా అభినందించారు.

యువకుడికి 'అమ్మ' అండ



బబ్లూకు నగదు అందిస్తున్న రమణారెడ్డి

అనంతపురం కల్చరల్: అమ్మ సంస్థ ఆపరేషన్‌కు అవసరమైన మొత్తాన్ని అందించి ఓ యువకుడికి అండగా నిలిచింది. వివరాలు.. జిల్లా కేంద్రంలోని బుడ్డప్పనగర్‌కు చెందిన మల్లేష్, ఝాన్సీల కుమారుడు బబ్లూ. చదువు ఆపేసి పెయింటింగ్ పనులకు వెళ్తున్నాడు. ఒకరోజు అనుకోకుండా కంటిలో వాపు వచ్చి విపరీతమైన నొప్పి రావడంతో వైద్యులకు చూపించారు.ఎండోప్తాల్మిటీస్ అనే జబ్బు కంటికి వచ్చిందని ఇది ఎంతో ప్రమాదకరమని తేల్చి చెప్పారు. త్వరగా శస్త్ర చికిత్స చేస్తే కంటి చూపును దక్కించుకోవచ్చని, వైద్య ఖర్చులకు రూ.1.20 లక్షలవుతుందని తెలిపారు. వారి ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్న అమ్మ సంస్థ తరిమెల రమణారెడ్డి వెంటనే స్పందించి బాధితుడికి రూ.1 లక్ష చెక్కునందించాడు. అలాగే బెంగళూరు నారాయణ నేత్రాలయ వెళ్లడానికి రవాణా ఖర్చులు, ఇతర మందుల ఖర్చులు వారి తల్లిదండ్రులకందించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరికొంతమంది ముందుకొస్తే చికిత్స అనంతరం బాధితుడికి సాంత్వన చేకూర్చినవాళ్లమవుతామని, సాయమందించాలని విజ్ఞప్తి చేశారు.

సహ చట్టంపై అవగాహన

అనంతపురం ఎడ్యుకేషన్: సమాచార హక్కు చట్టంపై స్థానిక ఎస్వీ డిగ్రీ, పీజీ కళాశాలలో మంగళవారం అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. సహ చట్టం వేదిక జిల్లా అధ్యక్షుడు ఎ.హొన్నూరప్ప మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం అమలుపై అధికారులు, ప్రభుత్వం పారదర్శకతతోపాటు జవాబుదారిగా ఉండాలన్నారు. సమాచార హక్కు చట్టం పూర్తి స్థాయిలో అమలు కావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారుల నుంచి సహకారం లభించడం లేదన్నారు. దరఖాస్తు చేసుకున్న 30 రోజుల్లో కోరిన సమాచారం అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. నిర్ణీత సమయంలోపు అందించకపోతే అప్పిలేట్ అధికారికి అప్పీల్ చేసుకోవచ్చన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్‌వీ ప్రసాద్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. సహచట్టం వేదిక సభ్యులు రామలింగప్ప ఇమామ్, ఏఓ శ్రీనాథ్, ఎన్‌ఎస్‌ఎస్ పీఓలు జి.ఆనంద్‌బాబు, ఎస్.పురుషోత్తం పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడి సన్నిధిలో ఎస్పీ



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న ఎస్పీ జగదీష్

ఆత్మకూరు: పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వరుడిని జిల్లా ఎస్పీ జగదీష్ మంగళవారం దర్శించుకున్నారు. ఎస్పీకి ఆలయ సిబ్బంది స్వాగతం పలికారు. అనంతరం ఎస్పీ కుటుంబ సభ్యులతో కలిసి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అధికారులు ఎస్పీకి స్వామి శేషవస్త్రం, చిత్రపటంతోపాటు ప్రసాదాలను అందజేశారు. అలాగే ఆది శంకరాచార్యులు సినిమా హీరో విజయ సూర్య ఉమామహేశ్వరరాజు స్వామి వారిని దర్శించుకున్నారు.

మైనార్టీల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

రాప్తాడు/అనంతపురం రూరల్: మైనార్టీల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని ఏపీ రాష్ట్ర మైనార్టీ వ్యవహారాల సలహాదారు ఎం.ఎ.షరీఫ్ అన్నారు. మంగళవారం ఆయన చిన్మయనగర్‌లో ఏపీ మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్, పోస్ట్ మెట్రిక్ బాలుర వసతి గృహం కోసం స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరున్నర ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్న ఈ భవనానికి జిల్లా కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి రామ సుబ్బారెడ్డిని ఆదేశించారు. ఇక్కడ మైనార్టీ విద్యార్థులకు అన్ని వసతులతో రెసిడెన్షియల్ స్కూల్‌ను నిర్మిస్తామన్నారు. డీఈ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో బహుళ ప్రయోజనాలు



పీఎండీఎస్ ద్వారా విత్తనాలను విత్తుతున్న దృశ్యం

రాప్తాడు: పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులకు బహుళ ప్రయోజనాలు ఉన్నాయని డీఎల్‌ఎం నరేంద్ర పేర్కొన్నారు. మంగళవారం గొల్లపల్లిలో లక్ష్మీనారాయణమ్మ అనే మహిళా రైతు పొలంలో ఎకరా విస్తీర్ణంలో ప్రిమాన్సున్ డ్రై సోయింగ్ (పీఎండీఎస్) పద్ధతిలో కంది, అనుములు, అలసంద, సజ్జ, ఆముదం, గోరుచిక్కుడు తదితర ప్రధాన పంటలతో పాటు 25 రకాల జీవవైవిధ్య పంటలను విత్తారు. ఈ సందర్భంగా డీఎల్‌ఎం మాట్లాడుతూ పీఎండీఎస్ అనేది వేసవి ముందు ప్రధాన పంటలుగా వేసే విత్తనాలు, జీవ వైవిధ్య పంటల విత్తనాలను బీజామృతంలో విత్తన శుద్ధి చేసుకుని ఆరబెట్టుకుని, విత్తన గుళికలుగా చేసుకుని ఘన జీవామృతంతో పాటుగా పొలంలో విత్తుకోవాలన్నారు. ఈ విధానం ద్వారా భూమిలో మట్టి నీటి నిల్వ పెరిగి, సూక్ష్మ జీవులు ప్రేరేపించబడి, ప్రధాన పంటకు అవసరమైన పోషకాలను అందుతాయన్నారు. నేలలో నైట్రోజన్ పెరిగి, మట్టిలో పోషక లభ్యత మెరుగుపడుతుందని తెలిపారు. రైతు సాధికార బృందం సభ్యులు పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాల వెరిఫికేషన్

అనంపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న బీసీ, ఈబీసీ సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 20 నుంచి 22 వరకు లలిత కళా పరిషత్‌లో సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఉంటుంది.ఈమేరకు కమిషనర్ బాలస్వామి మంగళవారం ప్రకటన విడుదల చేశారు.

చీడపీడలపై అప్రమత్తత అవసరం

సాక్షి ఎఫెక్ట్..



తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఓ రత్నకుమార్

రాప్తాడు: చీనీ పంటల్లో చీడపీడల పట్ల అప్రమత్తంగా ఉండాలని హార్టికల్చర్ ఆఫీసర్ రత్నకుమార్ రైతులకు సూచించారు. మంగళవారం సాక్షిలో 'చీనీకి తెగుళ్ల పోటు' శీర్షికన కథనం ప్రచురితమైన విషయం విదితమే. స్పందించిన ఆయన హంపాపురంలో చీనీరైతులకు పంటలో చీడపీడల నివారణపై అవగాహన కల్పించారు. మండలవాప్తంగా విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్లు ఆయా గ్రామాల్లో చీనీ పంట సాగు చేసే రైతులకు వారి పొలాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి చీనీ పంటకు ఏఏ తెగుళ్లు వ్యాపించాయో ఏఏ మందులు పిచికారీ చేయాలో చీనీ రైతులకు వివరించారు. ఈ సందర్భంగా హెచ్‌ఓ రత్నకుమార్ మాట్లాడుతూ రాత్రి వేళ తీవ్ర చలి, మంచు, పగటి పూట ఉష్ణోగ్రత ఎక్కువగా ఉండడం వల్ల పడమర దిశ ఉన్న చీనీకాయలు ఎండ పొడకు గురవుతాయన్నారు. నివారణకు రైతులు శాఖీయంగా కొమ్మలు ఎక్కువ ఉండేలా చూసుకోవాలన్నారు. యూరియా 10 గ్రాములు ఒక్క లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. అలాగే వారం తర్వాత లీటర్‌కి 20 గ్రాముల బట్టి సున్నం కలిపి పిచికారీ చేసుకున్న తర్వాత ఈ ఎండ పొడ తెగులును నివారించుకోవచ్చని తెలిపారు.

మతిస్థిమితం లేని బాలుడి అప్పగింత



ప్రభుదేవాను తల్లికి అప్పగిస్తున్న సీఐ శేఖర్, ఎస్‌ఐ రాంబాబు

రాప్తాడురూరల్: తప్పిపోయిన మతిస్థిమితం లేని బాలుడిని గంటలో తల్లిదండ్రులకు అప్పగించారు అనంతపురం రూరల్ పోలీసులు. వివరాల్లోకి వెళ్తే...కర్నూలు జిల్లా వెంకయ్యపల్లికి చెందిన నాగలక్ష్మి తన ఇద్దరు పిల్లలతో కలిసి భిక్షాటనకు రెండు రోజుల కిందట అనంతపురం వచ్చింది. మంగళవారం ఉదయం పెద్ద కుమారుడైన ప్రభుదేవా నగరంలో తప్పిపోయాడు. వయస్సు 16 ఏళ్లున్నప్పటికీ ఆ అబ్బాయి మతిస్థిమితం ఉండడంవల్ల తిరిగి తమను చేరుకోవడం కష్టంగా భావించి సాయంత్రం అనంతపురం రూరల్ పోలీసులను నాగలక్ష్మి ఆశ్రయించింది. మతిస్థిమితం లేని కుమారుడి ఆచూకీ కనుక్కోవాలని విన్నవించింది. ఈ నేపథ్యంలో సీఐ శేఖర్, ఎస్‌ఐ రాంబాబు గాలింపు చర్యలు చేపట్టారు. బళ్లారి బైపాస్ సమీపంలో ప్రభుదేవా ఆచూకీ కనుగొన్నారు. గంటలోపే బాలుడిని తల్లికి అప్పగించారు.